సాక్షి ఆదిలాబాద్

శనివారం । 27 । ఏప్రిల్ । 2024

I



బీఎస్పీ నిరసన

ఈసీ నిబంధనలకు విరుద్ధంగా దాఖలు చేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి నగేశ్ నామినేషన్ ఆమోదించడం సరికాదని బీఎస్పీ అభ్యర్థి జంగుబాపు అన్నారు. కలెక్టరేట్‌లో నిరసన తెలిపారు. IIలో▸



తనిఖీల్లో నగదు పట్టివేత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పలుచోట్ల నగదు పట్టుబడింది. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.0 /29.0

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరిగే అవకాశం ఉంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లాలోని అనాథలకు ప్రవేశం కల్పించనున్నట్లు ఐసీపీఎస్ అధికారి రాజేంద్ర ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ సివిల్ ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమో ఇన్ కంప్యూటర్ ఇంజినీరింగ్, డిప్లొమో ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 25 వరకు జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల బాలరక్షక భవన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం 9440289825, 9493433400 నంబర్లపై సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న 'ఓపెన్' పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ స్కూల్ ఇంటర్, టెన్త్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 327 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా, 300 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 641 మందికి గాను 53 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ పరీక్షలకు 356 మంది అభ్యాసకులకు గాను 308 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

టీఎస్‌పీఎస్‌ఈ ఏఈ ఫలితాల్లో జైనథ్ వాసి ప్రతిభ



అల్లూరి రంజీత్ రెడ్డి

జైనథ్: మండలంలోని కూర గ్రామానికి చెందిన అల్లూరి రంజిత్‌రెడ్డి గురువారం విడుదల చేసిన టీఎస్‌పీఎస్‌సీ అసిస్టెంట్ ఇంజినీర్(సివిల్)పరీక్షలో ఏడో ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం కలిగిన రంజిత్ ఎన్ఐటీ బీహార్‌లో బీటెక్(సివిల్ ఇంజినీర్) పూర్తి చేశాడు. ఎంటెక్ చేస్తూనే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యాడు. గతంలో బోర్డర్ రోడ్ ఆర్గనైజేషన్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. అంతటితో ఆగకుండా మళ్లీ అసిస్టెంట్ ఇంజినీర్ కోసం ప్రయత్నించి రాష్ట్రవ్యాప్తంగా ఏడో ర్యాంకు సాధించాడు. గ్రామస్తులు, మిత్రులు ప్రత్యేకంగా అభినందించారు.

మోడల్ స్కూల్ ప్రశ్నపత్రం 'కీ' విడుదల

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల నిర్వహించిన మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి 'కీ' విడుదల చేసినట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతికి సంబంధించిన 'కీ' [illegible] జీలో పొందుపర్చినట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులు వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని వివరించారు.

రేపు ఆదివాసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

ఎదులాపురం: జిల్లాకేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఆదివాసీ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉయిక విష్ణు, పూసం సచిన్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన విధానాలు–ఆదివాసీలపై ప్రభావం అంశంపై సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఆదివాసీ సంఘాలు, పటేళ్లు, రాయిసెంటర్ సార్మెడీలు, యువజన సంఘాలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఇంటిపన్ను చెల్లించి డిస్కౌంట్ పొందాలి

కైలాస్‌నగర్: పట్టణ ప్రజలు తమ ఆస్తి పన్నును ముందస్తుగా చెల్లించి ఐదు శాతం డిస్కౌంట్ పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ సూచించారు. పట్టణంలోని పలు వ్యాపార సంస్థల్లో ఎర్లీ బర్డ్ స్కీం కింద పన్నుల చెల్లింపు ప్రక్రియను శుక్రవారం ఆయన పరిశీలించారు. పన్నులు చెల్లించిన పలువురు వ్యాపారులకు స్వయంగా రశీదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 సంవత్సరానికి సంబంధించి పట్టణ ప్రజలు ముందస్తుగా పన్ను చెల్లించేలా ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఎలాంటి పాత బకాయిలు లేనటువంటి వారు ఈనెల 30వర కు పన్ను చెల్లిస్తే ఐదు శాతం డిస్కౌంట్ పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ ఆర్ఓ జాదవ్ కృష్ణ తదితరులు ఉన్నారు.

ఇచ్చోడ మండలంలోని సర్కారు పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఓ ఉపాధ్యాయుడు వారానికి ఒకట్రెండు సార్లు మాత్రమే బడిబాట పడతాడు. వ్యాపారి అవతారమెత్తి జిల్లాకేంద్రంలోని రాంనగర్‌లో పత్తి, సోయా, ఇతర పంటలు కొనుగోలు చేస్తాడు. ఎప్పుడు చూసినా అక్కడే దర్శనమిస్తాడు. సదరు ఉపాధ్యాయుడు బడికి డుమ్మా కొట్టినా ఆయనపై ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

జిల్లా కేంద్రంలో 2003–04లో ఓ ప్రైవేట్ కంపెనీ చైన్ సిస్టమ్ దందా ప్రారంభించింది. ఇందులో ఓ శాఖ ఉన్నతాధికారితో పాటు కొంత మంది ఉపాధ్యాయులు కీలకంగా ఉన్నారు. వారు పని చేసే గ్రామాల్లో ప్రజలను భాగస్వాములు చేసి ఆరేళ్లలో డబ్బులు రెట్టింపు అవుతాయని పెట్టుబడి పెట్టించారు. తీరా వారికి డబ్బులు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. గడువు ముగిసినా ఇవ్వకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ఉపాధ్యాయ సంఘ బాధ్యులు, కొంత మంది ఉపాధ్యాయులు నిత్యం జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దర్శనమిస్తారు. ఆ కార్యాలయం ముందు గల హోటల్‌లో కూర్చొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారు. అగ్రిమెంట్ ఇతరుల పేరిట చేయించి ఆ తర్వాత రిజిస్ట్రేషన్ సమయంలో వారి పిల్లలు, భార్య, బంధువుల పేరిట చేయిస్తున్నారు.

ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ ప్రాంతంలో ముగ్గురు ఉపాధ్యాయులు కలిసి హోటల్‌ను ఏర్పాటు చేశారు. సదరు ఉపాధ్యాయులు పాఠశాల వేళల్లో కూడా అక్కడే దర్శనమిస్తారు. ఈ విషయం విద్యాశాఖ అధికారులకు సైతం తెలిసినప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు ప్యూరీఫై వాటర్ దందాలోనూ మక్కువ చూపుతున్నారు. కమీషన్‌పై వాటిని విక్రయిస్తున్నారు. వారు పనిచేసే ప్రాంతాల్లో తోటి ఉపాధ్యాయులు, ఉద్యోగులకు వీటిని అంటగడుతున్నారు. కంపెనీ ఇచ్చిన లక్ష్యం దాటితే వీరికి బోనస్‌తో పాటు ఉచిత విహార యాత్రలు ఉంటాయి.

కొంత మంది గురువులు కాసులకు కక్కుర్తిపడి సొంతంగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఏర్పాటు చేసుకొని అక్కడే రోజంతా గడుపుతున్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడు బస్టాండ్ సమీపంలో ఓ కళాశాలను ఏర్పాటు చేసి నడుపుతున్నాడు.


జిల్లాలో సర్కారు ఉపాధ్యాయుల దందాలు ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

ప్రైవేట్ దందాలో పంతుళ్లు!

- నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు
- వృత్తి ధర్మాన్ని విస్మరిస్తున్న ఉపాధ్యాయులు
- అధికారుల తీరుపై అనుమానాలు

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు	1,146
అందులో పనిచేస్తున్న ఉపాధ్యాయులు	2,485

సాక్షి ఫోకస్



ఆదిలాబాద్‌టౌన్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉంది. నాణ్యమైన విద్యాబోధనతో విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దగలిగేది ఉపాధ్యాయులే. అలాంటి వృత్తికి కొంత మంది గురువులు కలంకం తెచ్చిపెడుతున్నారు. విద్యాబోధన సక్రమంగా చేయకుండా.. ప్రైవేట్ దందాల బాట పడుతున్నారు. చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారంపై మక్కువ చూపుతున్నారు. మరికొందరు చిట్టీలు నడుపుతూ లక్షల్లో గడిస్తున్నారు. ఎల్ఐసీ ఏజెంట్లు, కార్పొరేట్ కళాశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఏజెంట్లుగా, బంగారు దుకాణాలు, హోటళ్లు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, చైన్ సిస్టమ్ వ్యాపారం, ఇలా ఒక్కటేంటి.. అన్ని వ్యాపారాల్లో వీరు తలమునకలవుతున్నారు. కొంత మంది ఉపాధ్యాయులు ఏకంగా ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి రియల్ వ్యాపారంలో భాగస్వాములవడం చర్చకు దారి తీస్తోంది. ఇటీవల ఓ ప్రైవేట్ కంపెనీ చైన్ సిస్టమ్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లాకు చెందిన వెయ్యి మంది వరకు ఉపాధ్యాయులు ఈ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు బహిర్గతమైంది. ఇందులో వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు సూత్రధారులుగా ఉన్నారు. వారికి అండగా కొంత మంది ఉపాధ్యాయులు నిలిచారు. కాగా వీరు ఉపాధ్యాయులతో పాటు రైతుల ద్వారా కంపెనీలో డబ్బులు రెట్టింపు అవుతాయని కట్టించారు. వాటిని తిరిగి ఇవ్వకపోడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

అసలు కంటే.. కొసరుపైనే దృష్టి

ఈ వృత్తిలో ఉన్న వారికి మంచి వేతనాలు అందుతున్నా చాలదన్నట్లు ప్రైవేట్ దందాల బాట పడుతుండడం వారి అత్యాశకు నిదర్శనం. బోధనపై దృష్టి సారించకుండా.. వృత్తిధర్మాన్ని విస్మరిస్తున్నారు. చిట్టీల వ్యాపారం నడిపితే అందులో ఒక చిట్టీ వారిదే. ఇలా పెట్టుబడి లేకుండా రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలిసినప్పటికీ వీరు చేసే దందా కుటుంబీకులు, భార్య పిల్లల పేరిట ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారి సంఘాలకు సంబంధించిన భవనాలను అద్దెకు తీసుకుంటూ ఫంక్షన్ హాళ్లు సైతం నడుపుతుండటం గమనార్హం.

నిబంధనలకు తిలోదకాలు

బినామీ దందాలు చేస్తూ కొంత మంది ఉపాధ్యాయులు కోట్లకు పడగలెత్తుతున్నారు. సీసీఏ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుడు ఆ వృత్తి తప్ప ఇతర వ్యాపారాలు చేయడానికి వీల్లేదు. అలాగే వారు చదువు చెప్పే ఊరిలోనే ఉండి విద్యార్థులకు బోధన చేయాల్సి ఉండగా, కొన్ని కారణాలతో పట్టణాల్లో ఉంటున్నారు. ఈ క్రమంలో విధి నిర్వహణలో చాలా మంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి. వారు వెళ్లినప్పుడే విద్యార్థులకు చదువులు అన్న చందంగా మారింది. పర్యవేక్షణ కొరవడడంతో ఇలాంటివి పునరావృతం అవుతూనే ఉన్నాయి. జిల్లా విద్యా శాఖాధికారితో పాటు మండల విద్యాధికారులంతా ఇన్‌చార్జీలే కావడంతో విద్యావ్యవస్థ గాడి తప్పిందనే విమర్శలున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు



నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇతర వ్యాపారాలు చేయరాదు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్రైవేట్ వ్యాపారాలు చేస్తే వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవు. ఇలాంటి వారిపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఉపాధ్యాయులు పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసి వారి భవిష్యత్‌కు బాటలు వేయాలి. – ప్రణీత, డీఈవో

భద్రత కట్టుదిట్టం



రైల్వేస్టేషన్‌లో తనిఖీ నిర్వహిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం



రైలులో బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న ఎస్సై ధనశ్రీ

- ఎస్పీ గౌస్ ఆలం

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిగా రూపుమాపాలనే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని రైల్వేస్టేషన్, తాకూర్‌హోటల్ ప్రాంతంతో పాటు తలమడుగు మండలంలోని లక్ష్మీపూర్, పిప్పల్‌గాం చెక్‌పోస్టులను పరిశీలించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ మద్యం, డబ్బు, గంజాయి సరఫరాకు అడ్డుకట్ట వేస్తున్నామని తెలిపారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని, అలాగే వీడియోగ్రఫీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేసేలా పోలీసు యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతుందని వివరించారు.

కోసాయి రైల్వేస్టేషన్‌లో..

తలమడుగు: మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌కు వస్తున్న పర్లీ ప్యాసింజర్ రైలును ఎస్సై ధనశ్రీ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శుక్రవారం తనిఖీ చేశారు. కోసాయి రైల్వేస్టేషన్‌లో నిలిపిన ప్యాసింజర్ రైలులో ప్రయాణిస్తున్న వారిని క్షుణంగా తనిఖీ చేశారు.

తలమడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఎన్నికల అబ్జర్వర్ రాజేశ్‌కుమార్, ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మహా రాష్ట్ర నుంచి జిల్లాకు వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట సీఐ ఫణిందర్, సిబ్బంది తదితరులున్నారు.

10 తిరస్కరణ..13 ఆమోదం

- ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు ఓకే
- తిరస్కరణకు గురైన రాథోడ్ రమేశ్ నామినేషన్
- ముగిసిన నామినేషన్ల పరిశీలన



నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్న కలెక్టర్, అబ్జర్వర్



పరిశీలనకు హాజరైన అభ్యర్థులు, ఏజెంట్లు

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ చాంబర్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్‌తో కలిసి జిల్లా రిటర్నింగ్ అధికారి రాజర్షి షా నామినేషన్లను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. బీజేపీ అభ్యర్థిగా దాఖలు చేసిన మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్‌తో సహా పది మంది అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించారు. మరో 13 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించారు. మొత్తం దాఖలైన 42 నామినేషన్లలో 27 నామినేషన్లు ఆమోదించగా 15 నామపత్రాలను తిరస్కరించారు. మాలోతు శ్యామ్‌లాల్ నాయక్ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ), రాథోడ్ సుభాష్ (ఇండిపెండెంట్), ఆత్రం సుగుణ(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), మెస్రం గంగాదేవి(ధర్మ సమాజ్ పార్టీ), ఆత్రం సక్కు (భారత రాష్ట్ర సమితి), గేడం సాగర్ (ఇండియా ప్రజాబంధు పార్టీ), గొడం నగేశ్(భారతీయ జనతా పార్టీ), కొడప వామన్ రావు (గొండ్వానా దండకారణ్య పార్టీ), భుక్యా జైవంత్ రావు(స్వతంత్ర అభ్యర్థి), సునావత్ తిరుపతి (విద్యార్థుల రాజకీయ పార్టీ), రాథోడ్ రాజు(స్వతంత్ర అభ్యర్థి), చవాన్ సుదర్శన్ (అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ), జంగు బాపూ మెస్రం (బహుజన్ సమాజ్ పార్టీ)ల నామినేషన్లు ఆమోదం పొందాయి. చవాన్ రామ్(ఇండిపెండెంట్), రాథోడ్ రమేశ్ (భారతీయ జనతా పార్టీ), నేతావత్ రాందాస్ (ఇండిపెండెంట్), కుమ్రం మాంతయ్య (ఇండిపెండెంట్), పెందూరు సుధాకర్ (ఇండిపెండెంట్), ధరావత్ నరేందర్ (బీఆర్ఎస్), ఆత్రం భాస్కర్ (ఐఎన్‌సీ), నైతం రవీందర్ (ఇండిపెండెంట్), మడావి వెంకట్ రావు (రాష్ట్రీయ మానవ్ పార్టీ), ఆత్రం భీంరావు (ఇండిపెండెంట్)ల నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కాగా ఈ నెల 29వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంది. ఎంత మంది ఎన్నికల బరిలో ఉంటారనేది ఉపసంహరణ ప్రక్రియ అనంతరం తేలనుంది. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్‌పై వివాదం

భారతీయ జనతా పార్టీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ నామినేషన్ ఆమోదించడంపై కొంత వివాదం నెలకొంది. నామినేషన్ల దాఖలు సమయంలో అందించిన అఫిడవిట్‌లో తన భార్య పేరిట కలిగిన ఆస్తుల వివరాలు తెలిపే ఫారం నం.26తో పాటు పార్లమెంట్ నియోజకవర్గ నంబర్‌ను కూడా కాలమ్‌లో నమోదు చేయకుండా ఖాళీగా ఉంచడంపై బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. పరిశీలన సమయంలో ఈ అంశంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా దృష్టికి తీసుకెళ్లారు. కాగా వారి సూచనలను పట్టించుకోకుండా రిటర్నింగ్ అధికారి నామినేషన్‌ను ఆమోదించారు. దీనిపై బీఎస్పీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ఆందోళన చేపట్టారు.

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు రాజేంద్ర, కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్ సిబ్బంది రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం నిర్వహించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్ ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ సిబ్బందిని ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాజేంద్ర విజయ్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా సమక్షంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ట్రెయినీ కలెక్టర్ అభిగ్యా మాల్వియా తదితరులు పాల్గొన్నారు.

మూడోసారి మోదీని ప్రధాని చేయండి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్



వాకింగ్ చేస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న గొడం నగేశ్

ఆదిలాబాద్‌టౌన్: దేశంలో సుపరిపాలన అందిస్తున్న నరేంద్ర మోదీకి మరోసారి అవకాశం కల్పించి మూడోసారి ప్రధాని చేయాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంతో పాటు కలెక్టరేట్ చౌక్‌లో శుక్రవారం ఉదయం వాకర్స్‌తో మాట్లాడారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఆయన ప్రచారం చేపట్టారు. వాకింగ్ చేస్తూ సరదాగా ముచ్చటించారు. ఇందులో పార్టీ నాయకులు ఆదినాథ్, అశోక్, లాలామున్నా, రవి, పాల్గొన్నారు.

బీజేపీలో సమన్వయకర్తలు

- పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా నియామకం
- ఆదిలాబాద్‌కు ప్రదీప్‌కుమార్, పెద్దపల్లికి సుహాసినిరెడ్డి
- పార్టీ ఎమ్మెల్యేలకు ఇన్‌చార్జి బాధ్యత తొలగింపు



ఆదిలాబాద్ సమన్వయకర్త దుగ్యాల



పెద్దపల్లి సమన్వయకర్త సుహాసినిరెడ్డి



పార్టీ జారీ చేసిన ఉత్తర్వు ప్రతి

సాక్షి,ఆదిలాబాద్: బీజేపీ పార్లమెంట్ సెగ్మెంట్ వారీగా సమన్వయకర్త (కోఆర్డినేటర్)లను నియమించింది. ఆదిలాబాద్‌కు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ రావును, పెద్దపెల్లికి జెడ్పీ మాజీ చైర్ పర్సన్ చిట్యాల సుహాసినిరెడ్డిలకు బాధ్యతలు అప్పగించింది. ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యక్రమాల ను ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, అందరినీ సమన్వయం చేసుకుంటూ నిర్వహించాలని ఆదేశించింది. మొత్తంగా ఈ పరిణామం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకే పరిమితం..

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మొదట బీజేపీ పరంగా సెగ్మెంట్ వారీగా ఇన్‌చార్జీలను నియమించింది. వారి పర్యవేక్షణలోనే ఆ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ఎన్నికల నిర్వహణ జరిగేలా ఆదేశాలు ఇచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నలుగురు బీజేపీ ఎమ్మెల్యేలు ఉండగా, బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి నిజామాబాద్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌కు ఆదిలాబాద్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు పెద్దపెల్లి, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల బాధ్యతలు అప్పట్లో ఇచ్చారు. తాజాగా పార్లమెంట్ కోఆర్డినేటర్లను నియమించడంతో ఇన్‌చార్జీలను తొలగించినట్టేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు ఇక తమ నియోజకవర్గానికే పరిమితం కావాల్సింటుంది.

సమన్వయ లోపమేనా..

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండగా, బీజేపీ పరంగా ఈ నిర్ణయం వెలువడటం ఆ పార్టీలో ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై రకరకాల చర్చలు సాగుతున్నాయి. ప్రధానంగా ఎమ్మెల్యేలను ఇన్‌చార్జీలుగా నియమించిన తర్వాత ఆయా పార్లమెంట్ సెగ్మెంట్ల పరిధిలో సమన్వయ లోపం ఎదురైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఇటీవల జరిగిన సంఘటనలు పార్టీ అధిష్ఠానం దృష్టికి వెళ్లడంతో తక్షణం ఈ చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం తుది అంకానికి చేరింది. మే 13న ఎన్నికలు ఉండగా, మరికొద్ది రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గాల్లో సమన్వయకర్తను నియమించి వారి ద్వారా అందరు నేతలను కోఆర్డినేట్ చేసుకోవాలని ఆదేశించింది. ఈ పరిణామాలను పార్టీ శ్రేణులు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

క్లుప్తంగా

వడదెబ్బతో ఎమ్మెల్యేకు అస్వస్థత



ఇంటి వద్ద చికిత్స పొందుతున్న అనిల్ జాదవ్

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వడదెబ్బకు గురయ్యారు. ఇటీవల నియోజక వర్గంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బకు గురవగా, శుక్రవారం తన నివాసంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సద్దాం చికిత్స అందించారు. ఆయనను పలువురు పరామర్శించారు. పరామర్శించిన వారిలో బోథ్, నేరడిగొండ ఎంపీపీలు తుల శ్రీనివాస్, రాథోడ్ సజన్, బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఆయా మండలాల కన్వీనర్లు, తాజా మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వాహనం తనిఖీ



సుగుణ వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని నిర్మల్ బైపాస్ వద్ద ఇచ్చోడ పోలీసులు శుక్రవారం సాయంత్రం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ వాహనం తనిఖీ చేశారు. ఇచ్చోడ మీదుగా ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారును పోలీసు ఆపి తనిఖీ చేయగా ఆమె సహకరించారు.

అనారోగ్యంతో హెల్త్ సూపర్‌వైజర్ మృతి



సోమనాథ్ (ఫైల్)

భైంసాటౌన్: మండలంలోని మహాగాం పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పట్టణంలోని కిసాన్‌గల్లికి చెందిన సోమనాథ్ (58) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం విధులకు వెళ్లేందుకు సిద్ధమవుతూ అకస్మాత్తుగా ఇంట్లో కిందపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతిపై పట్టణానికి చెందిన పలువురు వైద్యులు, ఆస్పత్రి ఉద్యోగులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



అదుపు తప్పి పొలంలోకి వెళ్లిన కారు

కుంటాల: మండలంలోని అందాకూర్ కల్వర్టు వద్ద పంట పొలాల్లోకి కారు దూసుకెళ్లింది. వివరాలు.. మండలంలోని ఓలా గ్రామానికి చెందిన గోనె వెంకటేశ్ శుక్రవారం భైంసాకు కారులో వెళ్తున్నాడు. అందాకూర్ కల్వర్టు వద్దకు చేరుకోగానే కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

భానుడి భగభగ



నిర్మానుష్యంగా ఎన్టీఆర్‌చౌక్





ఎండలో చున్నీలు కప్పుకొని వెళ్తున్న యువతులు

భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే తన ప్రతాపం చూపుతున్నాడు. ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైబడి నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత పెరగడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

తనిఖీల్లో నగదు పట్టివేత



పట్టుకున్న నగదుతో పోలీసులు



ఎస్‌ఎస్‌టీ బృందానికి నగదు అప్పగిస్తున్న ఎస్సై

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ ఆదేశాల మేరకు ఆదిలాబాద్‌రూరల్, మావల పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తున్న ముగ్గురి నుంచి రూ.2లక్షల 55వేల స్వాధీనం చేసుకున్నారు. జైనూర్ మండలానికి చెందిన షేక్ షారుఖ్ వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో జైనూర్ నుంచి ఆదిలాబాద్‌కు తన వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.76,400 తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే జైనథ్ మండలం పిప్పల్‌గాకు చెందిన గౌండ్ల అవినాష్ నుంచి రూ.80వేలు, ఇంద్రవెల్లికి చెందిన అశ్విన్ నుంచి రూ.98,600 నగదును గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మొత్తాన్ని ఎఫ్‌ఎస్‌టీ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.

పిప్పర్‌వాడ చెక్‌పోస్టు వద్ద..

జైనథ్: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును సీజ్ చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. మండలంలోని పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నాగ్‌పూర్‌కు చెందిన అమిత్ సుధాకర్ సర్కె తన కారులో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఎలాంటి రశీదులు లేకుండా రూ.1లక్ష తీసుకెళ్తున్నాడు. అలాగే నాగ్‌పూర్‌కు చెందిన రిషితానే తన కారులోరూ.80వేలతో హైదరాబాద్ వెళ్తున్నాడు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న ఈ నగదును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. మొత్తాన్ని జిల్లా గ్రీవెన్స్ టీంకు అప్పగించినట్లు వివరించారు.

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం ఎస్సై చంద్రమోహన్ వాహనాల తనిఖీ చేపట్టారు. మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన పత్తిరెడ్డి పోతారెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1.90లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశారు. పట్టుకున్న నగదును కలెక్టరేట్‌లోని ప్రత్యేక కౌంటర్‌లో జమ చేసినట్లు పేర్కొన్నారు.

గంజాల్ టోల్‌ప్లాజా వద్ద రూ.69వేలు..

సోన్: మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద సీఐ నవీన్‌కుమార్ వాహనాల తనిఖీ చేపట్టారు. హైదరాబాద్ నుంచి నిర్మల్ వైపు వస్తున్న వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా తీసుకువెళ్తున్న రూ.69వేలు, మరో కారులో ఎలాంటి పత్రాలు లేని 70 చీరెలను పంచుల సమక్షంలో జప్తు చేసి నిర్మల్ ట్రెజరీ ఆఫీస్‌కు పంపించారు. ఎస్సై రవీందర్, సిబ్బంది ఉన్నారు.

సిర్గాపూర్ వద్ద రూ.85వేలు..

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామ బస్టాండ్ సమీపంలో శుక్రవారం ఎస్సై సుమాంజలి వాహనాల తనిఖీ చేపట్టారు. ఓ వ్యక్తి ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.85 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

రూ.93 వేల నగదు పట్టివేత

బేల: మండలంలోని శంకర్‌గూడ శివారు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రూ.93వేల నగదు పట్టుబడినట్లు ఎస్సై రాధిక తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకుండా రూ.93వేల నగదును గురువే సుంటాకే అనే వ్యక్తి కారులో చంద్రపూర్ నుంచి నాందేడ్ వైపు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా నగదు పట్టుబడగా.. ఎస్‌ఎస్‌టీ బృందానికి అప్పగించినట్లు ఆమె తెలిపారు.

మద్యం పట్టివేత

లక్ష్మణచాంద: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలోని బెల్ట్‌షాప్‌ను ఎస్సై శ్రీకాంత్ సిబ్బందితో తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 16 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.17,353 ఉంటుందని ఎస్సై తెలిపారు.

బస్ డిపోలో చొరబడిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఆర్టీసీ బస్ డిపోలో చొరబడిన వ్యక్తిపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. డాల్డా కంపెనీకి చెందిన మహ్మద్ ఫహీమ్ అలీ ఉదయం అనుమానాస్పదంగా డిపోలోకి చొరబడగా సిబ్బంది ఆయనను ప్రశ్నించారు. దీంతో వారితో దురుసుగా ప్రవర్తించాడు. డిపో మేనేజర్ కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ వివరించారు.

ఆలయ అధికారులకు నోటీసులు

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి అవసరమైన సామగ్రిని మార్కెట్ ధర కంటే అధికంగా వెచ్చించి కొనుగోలు చేసిన విషయమై విజిలెన్స్ అధికారులు తనిఖీ చేసిన విషయం తెలిసిందే. అధికారుల విచారణలో అక్రమాలు జరిగిన విషయం వెలుగులోకి రావడంతో ఈ మేరకు ఆలయ ఈవో విజయరామారావు స్పందించారు. అక్రమాలకు పాల్పడిన సూపరింటెండెంట్ సంజీవరావు, రికార్డ్ అసిస్టెంట్ నారాయణరావుపటేల్‌కు శుక్రవారం నోటీసులు జారీ చేశారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ సమీపంలో గల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు వాఘ్మారే విజయ్(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని రణదీవేనగర్‌కు చెందిన విజయ్ గురువారం హైదరాబాద్ నుంచి బైక్‌పై ఆదిలాబాద్‌కు వస్తుండగా మన్నూర్ సమీపంలో అర్ధరాత్రి సమయంలో వాహనం అదుపు తప్పి పడిపోగా తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని వాహనదారులు వెంటనే 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

చికిత్స పొందుతూ ప్రియుడు..

ఆదిలాబాద్‌రూరల్: ప్రేమ వ్యవహారంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరి గ్రామానికి చెందిన భుజంగ్‌రావు (28) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్సై ముజాహిద్ తెలిపిన ప్రకారం.. భుజంగ్‌రావు అదే గ్రామానికి చెందిన యువతి బోరెకర్ కవిత కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఈనెల 20 న ఇద్దరు భుజంగ్‌రావు పొలానికి వెళ్లి పురుగుల మందు తాగారు. అదే రోజు కవిత మృతిచెందగా, భుజంగ్ రావు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సివిల్ జడ్జికి వీడ్కోలు



జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

నిర్మల్‌టౌన్: ఇటీవల బదిలీ అయిన సీనియర్ సివిల్ జడ్జి అజేశ్‌కుమార్‌కు నిర్మల్ న్యాయవాదులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. అనంతరం పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ.. అజేశ్‌కుమార్ సీనియర్ సివిల్ జడ్జిగా జిల్లాకు అత్యుత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోగినపల్లి భవిష్య, నిర్మల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి మల్లారెడ్డి, కోశాధికారి నర్సారెడ్డి, న్యాయవాదులు వంశీ, శుభకరన్, గోవర్ధన్, గంగాధర్, రమణ, రాజు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి



విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో రవీంద్రకుమార్

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని డీఐఈవో రవీంద్ర కుమార్ అన్నారు. ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థులు జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో ఆయనను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో రాణిస్తూ అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ మార్కులు సాధించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులు హరిణి, బిందు, సుక్బీర్ కౌర్, అతిథి దేశ్‌పాండే, యాంగిల్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు బ్రహ్మం, అరవింద్, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి



కాంగ్రెస్ కార్యకర్తలతో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం డీసీసీ క్యాంపు కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టో గ్యారంటీ కార్డులను మండలాల వారీగా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రజాశ్రేయస్సు కోసం అనునిత్యం పాటు పడుతోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తోందని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త బూత్ స్థాయి నుంచి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న, చేయనున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సమష్టిగా కృషి చేసి పార్టీ గెలుపునకు పాటుపడాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, ప్రజాప్రతినిధులు, నాయకులు అర్జుమంద్ అలీ, చిన్ను, సాదా సుదర్శన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 13 గొర్రె పిల్లలు మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెపిల్లలు

తలమడుగు: కుక్కల దాడిలో 13 గొర్రె పిల్లలు చనిపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దేవాపూర్ గ్రామానికి చెందిన మద్దుల గంగారెడ్డికి చెందిన గొర్రె పిల్లలను తన పొలం వద్ద గల పాకలో రోజు మాదిరిగానే గురువారం ఉంచాడు. రాత్రి వీధి కుక్కలు అందులోకి చొరబడి దాడి చేసి 13 గొర్రె పిల్లలను చంపేశాయి. రెండు మాత్రం గాయాలతో బయటపడ్డాయి. గంగారెడ్డి ఉదయం పాకలో గమనించగా వాటి కళేబరాలు కనిపించాయి. మండల పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్‌కు సమాచారం అందించగా ఆయన అక్కడికి చేరుకుని వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతి చెందిన గొర్రె పిల్లల విలువ దాదాపు రూ.50వేల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. పరిహారం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

బీజేపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి
- కలెక్టరేట్ ఎదుట పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన

కైలాస్‌నగర్: ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా నామినేషన్ పత్రాలు దాఖలు చేయని బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్ తిరస్కరించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి కోరారు. శుక్రవారం దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోడం నగేశ్ తన కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపర్చకుండా ఖాళీగా వదిలేశారన్నారు. ఈసీ నిబంధనల ప్రకారం ఇలా చేస్తే నామినేషన్ తిరస్కరించాలని, కానీ అధికారులు ఆమోదించడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లినా ఫిర్యాదు స్వీకరించే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల అధికారులు స్పందించి వెంటనే ఆయన నామినేషన్ తిరస్కరించాలని డిమాండ్ చేశారు. అధికార యంత్రాంగం నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదన్నారు. ఈ విషయమై ఇప్పటికే తమ పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లామని, దీనిపై రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో పాటు న్యాయ పోరాటం చేస్తామన్నారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ తక్షణమే స్పందించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్ ఆమోదించడం ముమ్మాటికీ అధికార దుర్వినియోగమేనని ఆరోపించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ దర్శనాల లక్ష్మణ్, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, రషీద్, షకీల్ తదితరులున్నారు.

రిటర్నింగ్ అధికారి తీరుపై బీఎస్పీ నిరసన

- ఈసీకి ఫిర్యాదు చేసిన ఎంపీ అభ్యర్థి

కైలాస్‌నగర్: ఈసీ నిబంధనలకు విరుద్ధంగా దాఖలు చేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ నామినేషన్‌ను తిరస్కరించాల్సిన అధికారులు ఆమోదించడం సరికాదని బీఎస్పీ ఎంపీ అభ్యర్థి మేస్రం జంగుబాపు అన్నారు. నగేశ్ నామినేషన్ తిరస్కరించాలని డిమాండ్ చేస్తూ రిటర్నింగ్ అధికారి తీరుకు వ్యతిరేకంగా శుక్రవారం కలెక్టరేట్‌లో ఆ పార్టీ నాయకులతో కలిసిన నిరసన తెలిపారు. నగేశ్ దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లోని ఫారం 26లో వివరాలను నమోదు చేయకుండా ఖాళీగా ఉంచారన్నారు. దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో పాటు నామినేషన్‌ను ఆమోదించారన్నారు. ఈసీ నిబంధనలకు ఇది విరుద్ధమన్నారు. నామినేషన్‌ను ఆమోదించిన రిటర్నింగ్ అధికారిపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఎక్స్ వేదికగా తగు ఆధారాలతో ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి వెంటనే నామినేషన్ తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు జగన్ మోహన్‌రావు, లక్ష్మి, జయశ్రీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాహితీ సదస్సు కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఈనెల 28న వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో 'లౌకిక విలువలు–సాహిత్యం' అనే అంశంపై సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం నిర్వహించనున్న సాహితీ సదస్సు కరపత్రాన్ని తెలంగాణ రచయితల వేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రచయితల వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ దామెర రాములు మాట్లాడుతూ.. లౌకిక, సామాజిక, రాజ్యాంగ విలువల రక్షణ కోసం కవులు, కళాకారులు, మేధావులు సామూహిక కవితాగానం చేయనున్నట్లు పేర్కొన్నారు. శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం కోసం కవులు, రచయితలు తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో వేదిక నిర్మల్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల హన్మంతు, ప్రధాన కార్యదర్శి బీ వెంకట్, కవులు అంబటి నారాయణ, పత్తి శివప్రసాద్, కామారపు జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తా

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

కడెం: బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ గెలుపు కోసం కృషి చేస్తానని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీగా నామినేషన్ వేసిన తాను పోటీలో ఉండనని తెలిపారు. తాను పార్టీ నియమావళిని ఉల్లంఘించలేదని పేర్కొన్నారు. బీజేపీ బీ ఫాం పొందిన గోడం నగేశ్ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. అంతకుముందు మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకం మహేందర్, కడెం, దస్తురాబాద్ మండలాల అధ్యక్షులు కాశవేని శ్రీనివాస్, లక్ష్మణ్, నాయకులు రవీందర్‌రెడ్డి, తిరుమల్, కృష్ణ, సత్తెన్న, శ్రీరాం తదితరులున్నారు.

పెచ్చులూడుతోంది...



ఈ దృశ్యం భైంసా పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలోనిది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవో కోమల్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. భవనం కింది అంతస్తులో సిబ్బంది విధులు నిర్వర్తిస్తుండగా, పై అంతస్తులో ఎన్నికల కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఎన్నికల సామగ్రి అక్కడే భద్రపరిచారు. కాగా, పై అంతస్తులోని గది పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా, ఉద్యోగులు భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు పైకప్పు ఉరిస్తే సామగ్రి తడిచిపోయే అవకాశముంది. త్వరగా మరమ్మతు చేయించాలని సిబ్బంది కోరుతున్నారు. - భైంసాటౌన్

క్లుప్తంగా

సోయా పంటలు పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ఏవో రవీందర్

తాంసి: మండలంలోని వడ్డాడి శివారులో సోయా పంటలను ఏవో రవీందర్ పరిశీలించారు. యాసంగి సీజన్‌లో రైతులు ఓ కంపెనీ చెందిన సోయా విత్తనాలను చేలలో సాగుచేశారు. ప్రస్తుతం పంట ఎదగకపోవడం, కాత సరిగ్గా లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి వచ్చిన విత్తన కంపెనీ ప్రతినిధులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించిన విషయం తెలిసిందే. కాగా, జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఏవో రవీందర్ శుక్రవారం సోయా పంటలు పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఏఈవో యోగిరాజ్, రైతులు శ్రీనివాస్, ప్రకాశ్, లక్ష్మణ్, భూమయ్య, హన్మాండ్లు తదితరులు ఉన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని బంగారుగూడ కాలనీకి చెందిన సిస్లే పవన్‌పై దాడిచేసిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..బంగారుగూడ కాలనీకి చెందిన సిస్లే పవన్ ఇంటికెళ్లి షేక్ తాజ్, అలీమ్, ఇర్ఫాన్ గురువారం రాత్రి దాడి చేశారు. దీంతో పవన్‌కు గాయాలయ్యాయి. కాగా, తన తల్లికి ఫోన్ ఎందుకు చేస్తున్నారని పవన్ తాజ్‌ను ప్రశ్నించగా దాడికి దిగినట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక



కండువా కప్పుతున్న కంది శ్రీనివాసరెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని పలు వార్డులకు చెందిన యువకులు, మహిళలతోపాటు జైనథ్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ క్యాతం శివ ప్రసాద్‌రెడ్డి, బీఆర్ఎస్ మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు పర్వీనా సుల్తానా శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక ప్రజాసేవ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి వారికి కండువాలు కప్పారు. పార్లమెంట్ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ఫణీంద్ర

తలమడుగు: గ్రామ పంచాయతీలో ఎప్పటికప్పుడు పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని డీఎల్‌పీవో ఫణీంద్ర అన్నారు. మండలంలోని రుయ్యాడి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. పంచాయతీ సిబ్బంది, బీఎల్‌వోలు చేపడుతున్న పోలింగ్ స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి అభయ్‌కుమార్, ఎంపీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఉదయం వేళల్లో పనులు చేపట్టాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

నేరడిగొండ: ఉపాధి హామీ పనులను ఉదయం వేళల్లో చేపట్టాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. మండలంలోని కుంటాల(కె) గ్రామంలో కొనసాగుతున్న పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో కూలీలకు నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని టీఏ, ఎఫ్ఏలను ఆదేశించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కొనుగోళ్లలో కొర్రీలు

- జొన్న రైతులకు పరీక్ష
- ఎకరాకు 8.85 క్వింటాళ్లే కొనుగోలు
- దిగుబడి 18 నుంచి 25 క్వింటాళ్లు
- అమ్ముకోవడానికి రైతుల అవస్థలు



ఈ చిత్రంలో ఉన్నది రైతు సామ లక్ష్మారెడ్డి. ఈయనది నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామం. ఈ ఏడాది యాసంగిలో నాలుగెకరాల్లో జొన్న సాగు చేశాడు. మొత్తం 80 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 35 క్వింటాళ్ల జొన్న విక్రయించాను. మిగతా పంటను ప్రైవేట్‌లో అమ్ముకోవాల్సిన పరిస్థితి. దాదాపు రూ.50 వేల వరకు నష్టపోతానని వాపోతున్నాడు. జిల్లాలో చాలామంది రైతులది ఇదే పరిస్థితి.



ఇచ్చోడ మార్కెట్ యార్డులో జొన్నలు కొనుగోళ్లు చేస్తున్న దృశ్యం

ఇచ్చోడ: జిల్లాలో జొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వం జొన్న కొనుగోళ్లలో కొర్రీలు విధిస్తుండటంతో పండించిన పంటలను అమ్ముకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. ఎకరాకు 8.85 క్వింటాళ్ల మాత్రమే కొనుగోళ్లు చేయాలని ప్రభుత్వం షరతు విధించింది. కానీ జిల్లాలో యాసంగిలో జొన్న సాగు చేసిన రైతులకు కాలం కలిసోచ్చి ఎకరాకు 18 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. పండించిన పంటలను అమ్ముకోవడానికి మార్కెట్‌కు వెళ్తే ప్రభుత్వ నిబంధనలతో బిత్తరపోతున్నారు. పంటలకు దిగుబడి వచ్చిన సంతోషం రైతులకు లేకుండా పోయింది.

55 వేల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో 55 వేల ఎకరాల్లో జొన్న సాగైంది. కాలం కలిసి రావడంతో ఎకరాకు 18 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. 11 లక్షల క్వింటాళ్ల జొన్నలు మార్కెట్‌లోకి రానున్నాయని వ్యవసాయ అధికారుల అంచనా వేశారు. కానీ ప్రభుత్వ నిబంధనలతో ఎకరాకు 8.85 క్వింటాళ్ల కొనుగోళ్ల ప్రకారం ప్రభుత్వం 4,86,750 క్వింటాళ్లను మాత్రమే కొనుగోళ్లు చేయనుంది. మరో 6 లక్షల క్వింటాళ్ల జొన్నలను ప్రైవేట్ మార్కెట్‌లో రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది.

క్వింటాల్ ధర రూ.3,180

ఈ ఏడాది క్వింటాల్ జొన్నకు ప్రభుత్వం రూ 3,180 మద్దతు ధర ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డులో కొనుగోళ్లను ప్రారంభించారు. ప్రభుత్వ మద్దతు ధరకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్న ధరలకు క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకు వ్యత్యాసం ఉంది. ప్రభుత్వం విధించిన నిబంధనలతో రైతులు పండించిన పంటలను పూర్తిగా అమ్మకోవడానికి వీలులేకుండా పోయింది. ప్రైవేట్‌లో అమ్ముదామంటే క్వింటాల్‌కు రూ.వెయ్యి నష్టపోవాల్సి వస్తోంది.

సంక్షిప్తంగా

కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

ఇచ్చోడ: కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రేణిగుంట సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో కార్మిక సంఘాలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికసంఘాలు కలిసికట్టుగా తమ హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. మేడేను కార్మికులు ఘనంగా నిర్వహించుకోవాలని కోరారు. సమావేశంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.నరసింహులు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గంగయ్య, కార్మిక సంఘం నాయకులు రాజకుమార్, గోపి, శివకుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు జొన్నల కొనుగోళ్లు నిలిపివేత

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో శని, ఆదివారాల్లో జొన్నల కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు సొసైటీ సీఈవో కేశవ్ ఓ ప్రకటనలో తెలిపారు. జొన్నలో తేమశాతం అధికంగా వస్తున్నందున కొనుగోళ్లు బంద్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేరడిగొండ: వాతావరణంలో మార్పుల కారణంగా ఈనెల 27, 28 తేదీల్లో బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో జొన్న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు ఆ కేంద్రం ఇన్‌చార్జి స్వామి ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 29 నుంచి గ్రామాల వారీగా కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డులో కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్లకు బ్రేక్ పడింది. వాతావరణం సహకరించకపోవడంతో 27న కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు పీఏసీఎస్ కార్యదర్శి గంగన్న ఓ ప్రకటనలో తెలిపారు. కొనుగోళ్ల పునఃప్రారంభం తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నేడు భీంపూర్ సర్వసభ్య సమావేశం

తాంసి: భీంపూర్ మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గడ్డం గోపాలకృష్ణారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ

నేరడిగొండ: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బీఎల్వోలు ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని లింగట్ల గ్రామంలో బీఎల్వోలు పంపిణీ చేస్తున్న స్లిప్‌లను ఎంపీడీవో రాజ్‌వీర్ శుక్రవారం పరిశీలించారు. వారితో కలిసి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు స్లిప్‌లు అందజేశారు.

సన్మానం

ఇచ్చోడ: ఇంటర్ ఫస్టియర్ హెచ్‌ఈసీలో 470 మార్కులు సాధించిన మండలంలోని సిరిచెల్మ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి రహీఫ్‌ను మాజీ సర్పంచ్ లక్ష్మి కన్నమయ్య, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. విద్యార్థి తండ్రి ఫారుఖ్‌ను సత్కరించారు. పేద విద్యార్థి రహీఫ్ ఇచ్చోడ మైనార్టీ గురుకుల కళాశాల్లో చదివి ఇంటర్‌లో జిల్లా టాపర్‌గా నిలవడం గ్రామానికి గర్వకారణమన్నారు.

ఇంద్రవెల్లి: ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ర్యాంక్ సాధించిన మండలంలోని ముత్నూర్‌కు చెందిన రేకుల్‌వార్ శుభంను ఇంద్రవెల్లి, ఉట్నూర్ సన్‌సైన్ స్కూల్ నిర్వాహకులు శుక్రవారం సన్మానించారు. ఆయన తండ్రి సత్యానారాయణను సత్కరించారు. నిర్వాహకులు రాజగోపాల్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

తాంసి: ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని సావర్గాం, గోట్కూరి గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేపట్టారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, నాయకులు సుభాష్, మహేందర్, లస్మన్న, పోచ్చన్న ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని రవీంద్రనగర్‌లో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన సతీమణి పాయల్ ఉమతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమాది క్రతువుల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. కాగా, కాలనీకి చెందిన మహిళలు అమ్మవారికి సాముహిక బోనాలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు ఐక్యంగా ఉండి ఆలయాన్ని నిర్మించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ ప్రశాంత జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు.

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలు ఎండగట్టాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని కుమురం భీం భవనంలో శుక్రవారం కార్మిక దినోత్సవ వాల్ పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మోదీ పదేళ్ల పాలనలో పరిశ్రమల మూతపడి కార్మికులు బజారునపడ్డారన్నారు. పోరాటాలతో హక్కులు సాధించుకోవచ్చన్నారు.కార్మిక దినోత్సవాన్ని కార్మిక సంఘాలు, ఉద్యోగులు, అనుబంధ సంఘాలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సుభాశ్, దత్తు, ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్, దేవిదాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు శేషరావు, ఉపాధ్యక్షులు సంజయ్, అఖిల్ పాల్గొన్నారు.

‘హామీలు నెరవేర్చడంలో విఫలం’



కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పలు వార్డుల్లో శుక్రవారం పర్యటించారు. కాలనీవాసులను కలిసి కారు గుర్తుకే ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత కాంగ్రెస్ ప్రస్తుతం వాటిని విస్మరిస్తుందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడంలో విఫలమయ్యారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు అజయ్, యూనుస్ అక్బాని, నర్సింగ్, ధమ్మపాల్, గణేశ్, భూమన్న, పర్వీన్, రమేశ్, విజ్జగిరి నారాయణ, పండ్ల శ్రీను, ప్రకాష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించండి

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని పీఏసీఎస్ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్ కోరారు. మండలంలోని లింగుగూడ, ధర్‌లొద్దీ, తదితర గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కుమ్ర విజయ లక్ష్మిరాజు, మాజీ సర్పంచులు సిడాం లక్ష్మణ్, దుర్వ రాంచందర్, కొడప మాధవ్, నాయకులు వసంత్, సిడాం గణపతి, మోతిరాం ఉన్నారు.

నార్నూర్: ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు అన్నారు. మండలంలోని బోర్గవ్, సుంగాపూర్, బాబేఝరి గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ హయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంత్‌రావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఊర్వేత రూప్‌దేవ్, సీనియర్ నాయకుడు సయ్యద్ ఖాసిం ఉన్నారు.

ఇచ్చోడ: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని బోరిగామ, కామగిరి గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు గాడ్గే సుభాష్, పాండురంగ్, నర్వాడే రమేశ్, మహేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ప్రవీణ్ పాల్గొన్నారు.

తాంసి: ఆత్రం సక్కును గెలిపించాలని భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ కోరారు. భీంపూర్ మండలంలోని గోముత్రి, అంతర్గాం గ్రామాల్లో మండల నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. పార్టీ కన్వీనర్ నాగయ్య, నాయకులు షేక్ అఫ్రోజ్, నితిన్, లింబాజీ పాల్గొన్నారు.

నేరడిగొండ(బోథ్): ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ కోరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం బోథ్ మండల పరిధిలోని పట్నాపూర్, మర్లపెల్లి, బాబెరా, చింతకుంట, గురుదేవ్‌నగర్, ఇంకార్పెల్లి, మేడిగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ నారయణరెడ్డి, మాజీ సర్పంచ్ సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచులు పంద్రం సుగుణ శంకర్, కొమ్ము చంద్రమోహన్, బాబుసింగ్, దేవేందర్, సురేష్, తోడసం భూమన్న, నాయకుడు రాథోడ్ రాయలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రుక్మన్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ రమేశ్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జైనథ్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కేదర్‌పూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన హోమం, పూజాది కార్యక్రమాల్లో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు, గ్రామస్తులు ఉన్నారు. ఆదేవిధంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హోమాది క్రతువుల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆయన్ను నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ



నేరడిగొండ: వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఇచ్చోడ సీఐ భీమేశ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్పీ గౌస్ అలం ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేస్తున్నామని సీఐ తెలిపారు.

సిరికొండ: మండల కేంద్రంలో ఎస్సై నవీన్ శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట వాహనపత్రాలు తెచ్చుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఈయన వెంట కానిస్టేబుళ్ల తదితరులు ఉన్నారు.

నేరడిగొండ(బోథ్): మహారాష్ట్రలో సాధారణ ఎన్నికలు జరిగిన సందర్భంలో బోథ్ ఎస్సై రాము శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన బోథ్ మండల కేంద్రంలోని సోనాల గ్రామంలో తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. అక్రమంగా నగదు, మద్యం తరలించకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



ఎద్దు మృతదేహం

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్ గ్రామంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఎద్దు మృతిచెందింది. గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎద్దు మేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతిచెందినట్లు బాధిత రైతు నైతం నందకుమార్ తెలిపారు. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగణ



గుడిహత్నూర్: ఓటు అభ్యర్థిస్తున్న ఆత్రం సుగుణ

గుడిహత్నూర్: దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఆమె ప్రచారం నిర్వహించారు. ప్రధాన వీధులగుండా వ్యాపారులను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ షాహీద్ పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని ఆదివాసీ, గిరిజన గూడాల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రచారం నిర్వహించారు. నేరడిగొండ, వడూర్, రేంగన్‌వాడి, బొందిడి, రోల్‌మామడ, గుత్పాల తదితర ఆదివాసీ, గిరిజన గూడాల్లో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. పేదింటి ఆదివాసీ బిడ్డగా తనను ఈ ఎన్నికల్లో ఆశీర్వదించాలని గొండీ భాషలో సుగుణ మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజలకు వివరించారు. నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి, అరుణ్ కుమార్, భాస్కర్, వసంత్‌రావు, ప్రవుల్‌చందర్ రెడ్డి, పసుల చంటి, బద్దం పోతారెడ్డి, సంజీవ్ కుమార్, రాములు, శ్రీకాంత్, శంకర్, రవి పాల్గొన్నారు.

నేరడిగొండ(బోథ్): కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపిద్దామని ఆ పార్టీ జిల్లా నాయకుడు ఏలేటి అశ్విన్ రెడ్డి అన్నారు. బోథ్ మండలంలోని లెండిగూడ, మహదుగూడ, కేశవ్‌గూడ, జైతుగూడ, చింతల్‌బోరి, గొల్లపూర్, గుట్టపక్కతండా, ఘన్‌పూర్, గుర్రాలతండా గ్రామాల్లో గడప గడపకూ ప్రజాయాత్ర పేరిట ప్రచారాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఆ పార్టీకి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, బోథ్ ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరడిగొండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, ఆడే గజేందర్‌ల సమక్షంలో బోథ్ మండలం కౌఠ(బి) గ్రామానికి చెందిన ఎస్సీ, బీసీ సంఘాల ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఇచ్చోడ: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని గేర్జం, కేశవపట్నం, సిరిచెల్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొని మాట్లాడారు. ఆదివాసీ మహిళగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్, పార్లమెంట్ నాయకులు భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిముద్‌ఖాన్, కోటేశ్వర్, జాంటి, మోహరాజ్ అహ్మద్, జాలైజాకు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సిరికొండ: కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. మండలంలోని వాయిపేట్ గ్రామంలో ఆమె పర్యటించి మహంకాళీ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఆలయ మహరాజ్ కినక శంబు మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు.

బీఆర్ఎస్ ప్రచార రథాలకు పూజ



పూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని దుర్గానగర్‌లో గల దుర్గామాత ఆలయంలో శుక్రవారం నూతన ప్రచార రథ వాహనాలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న పూజ చేశారు. అనంతరం దుర్గానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్నివర్గాలకు న్యాయం జరిగిందన్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చినా కాంగ్రెస్ పార్టీపై నాలుగు నెలల్లోనే ప్రజలు విసుగు చెందారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. నాయకులు విజ్జగిరి నారాయణ, భరత్ తదితరులు ఉన్నారు.

పశువుల పాక దగ్ధం



పరిశీలిస్తున్న సామ రూపేష్‌రెడ్డి

బేల: మండలంలోని డౌన గ్రామ శివారులో రాథోడ్ రవీందర్‌కు చెందిన పంట చేనులోని కొట్టం (పశువుల పాక)లో గురువారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. కొట్టంలో వ్యవసాయానికి సంబంధించిన పరికరాలు, సోలార్ పరికరాలతోపాటు నిల్వ చేసిన 3 క్వింటాళ్ల గోధుమలు, డ్రిప్ ఇరిగేషన్‌తోపాటు స్ప్రింక్లర్ పైపులు అగ్నికి ఆహుతైంది. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి బాధిత రైతును పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచ్ బాపురావు, రోహిదాస్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.